క్లుప్తంగా

మార్టూరులో ఆశ్రమం ప్రారంభం



ఆశ్రమాన్ని ప్రారంభిస్తున్న పట్టణ ప్రముఖులు

మార్టూరు: మండల కేంద్రం మార్టూరులోని విజయ నగర్ కాలనీలో వెంకయ్య సోషల్ వెల్ఫేర్ సొసైటీ ఆశ్రమాన్ని శుక్రవారం పట్టణ ప్రముఖులు ప్రారంభించారు. ఎఫర్ట్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ జాష్టి మోహనరావు, శ్రీకారం కళాపరిషత్ కార్యదర్శి జాష్టి అనూరాధ, ఎస్ఎంబీ బుడేలు రిబ్బన్ కత్తిరించి ఆశ్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్ఎంబీ బుడే మాట్లాడుతూ ఆశ్రమం ద్వారా వృద్ధులు, అనాథలకు నిర్వహించే నిత్యాన్నదానానికి అవసరమైన కూరగాయలను తమ కూరగాయల మార్కెట్ ద్వారా ఉచితంగా పంపిణీ చేస్తామన్నారు. అనంతరం ఆశ్రమ నిర్మాణానికి రూ. 10 వేలు విరాళం అందజేశారు. కార్యక్రమంలో మార్టూరు రోటరీ క్లబ్ అధ్యక్షుడు కొర్రపాటి ఖాజారావు, పీ కృష్ణారావు, రావి అంకమ్మచౌదరి, సాంబశివరావు పాల్గొన్నారు.

లక్ష్యంతో చదివితే ఉన్నత శిఖరాలు



మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్ రవికుమార్

వేటపాలెం: విద్యార్థులు ముందుగా లక్ష్యాన్ని ఎంచుకొని చదువుల్లో రాణించాలని చీరాల ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ పొగడదండ రవికుమార్ సూచించారు. స్థానిక బండ్ల బాపయ్య హిందూ జూనియర్ కళాశాల్లో ఎంసెట్ ఉచిత శిక్షణ శిబిరాన్ని ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థుల కోసం బీబీహెచ్ కళాశాల యాజమాన్యం నిర్వహిస్తున్న ఎంసెట్ ఉచిత శిక్షణను విద్యార్థులు సద్వినియోగించుకోవాలని సూచించారు. మంచి ర్యాంకులు సాధించడానికి పట్టుదలతో ముందుగా సాగాలన్నారు. 45 రోజుల పాటు ఉచిత శిక్షణ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ లేళ్ల కృష్ణమూర్తి, సంయుక్త కార్యదర్శి చల్లా వాసుదేవరావు, కమిటీ సభ్యులు బండ్ల శరత్ బాబు, కొసనం నాగమాంబ, గుత్తి హేరంభరావు, గొల్లపూడి సీతారాం, విశ్రాంత ప్రిన్సిపాల్ సత్రం మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

నాణేలు, కరెన్సీ ప్రదర్శన



పురాతన నాణేలు, కరెన్సీ పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

కారంచేడు: బ్రిటీష్-ఇండియా కాలంతో పాటు, పురాతన అరుదైన నాణేలతో పాటు, ఎన్నో ఏళ్ల నాటి నోట్లను కుంకలమర్రు ఉన్నత పాఠశాలలో ప్రదర్శించారు. శుక్రవారం మండలంలోని కుంకలమర్రు హైస్కూల్ ప్రాంగణంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల ముందు ప్రదర్శన నిర్వహించారు. మండలంలోని ఆదిపూడి గ్రామానికి చెందిన కాల్వ రఘురామయ్య తనకు చిన్నతనం నుంచి నాణేలు, నోట్లను సేకరించడం అలవాటుగా మారింది. దీంతో ఆయన శ్రీరాముని పాలన నుంచి, పాతకాలం నాటి అర్ధణా, అణా, బేడల దగ్గర నుంచి పైసా, రెండు, మూడు, ఐదు పైసల బిళ్లలను ఆయన ప్రదర్శనగా ఉంచారు. నోట్లలో పాత తరం రూపాయిలు రద్దయిన రూ.500, రూ.1000 నోట్ల వరకు ఈ ప్రదర్శనలో ఉంచారు. దీంతో అనేక మంది ఉపాధ్యాయులు సైతం వీటిని ఆసక్తిగా తిలకించారు. ఉచితంగా ప్రదర్శించిన రఘురామ్‌ను హెచ్ఎం పద్మావతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించి కృతజ్ఞతలు తెలిపారు.

పది పరీక్షలకు మూడు పరీక్ష కేంద్రాలు

బల్లికురవ: ఈ నెల 3వతేదీ నుంచి జరిగే పదో పదోతరగతి పరీక్షలకు మండలంలో మూడు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. కేంద్రంలో 518 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నట్లు ఎంపీవో పీ. వీరరాఘవయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బల్లికురవ ఉన్నత పాఠశాలలో 108 మంది, కేజీబీవీలో 196 మంది, వైదన ఉన్నత పాఠశాలలో 213 మంది పరీక్షలకు హాజరవుతున్నారని, జంబ్లింగ్ విధానంలో జరిగే పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు తల్లిదండ్రులు సహకరించాలని ఎంఈవో కోరారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా చంద్రశేఖర్

అద్దంకి రూరల్: స్థానిక కోర్టు ఆవరణలో నిర్వహించిన సమావేశంలో నూతన బార్ అసోసియేషన్ కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు నూతన అధ్యక్షుడు శుక్రవారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. నూతన అద్దంకి బార్ అధ్యక్షుడిగా ఎం. చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడిగా టి.మార్తా శ్రీను, సెక్రటరీ టి. ప్రసాద్‌బాబు, జాయింట్ సెక్రటరీ ఏఎం సత్యవతి, ట్రెజరర్ ఎస్ రమణయ్య, లైబ్రరియన్ శ్రీనివాసరావు, లేడి రెప్రజెంటివ్‌గా ఎస్. కుసుమలతలను ఎన్నుకున్నట్లు తెలిపారు.



చినగంజాం రైల్వేస్టేషన్‌లో నూతన రైల్వే స్టేషన్ భవనం



నూతనంగా నిర్మించిన ఫుట్ ఓవర్ బ్రిడ్జి

ఒక వైపు అభివృద్ధి.. మరోవైపు తిరోగమనం

- పూర్వ వైభవాన్ని కోల్పోతున్న చినగంజాం రైల్వేస్టేషన్
- రిజర్వేషన్ కౌంటర్, సీజన్ టికెట్ల జారీ ఎత్తివేసేందుకు చర్యలు
- ఇప్పటికే స్టేషన్‌లో ఆగని పలు రైళ్లు

చినగంజాం: దేశంలో ప్రైవేటీకరణతో పలు ప్రభుత్వ సంస్థలు కనుమరుగయ్యే స్థితి నెలకొంది. నాలుగు దశాబ్దాల క్రితం ఎంతో వైభవంగా విరాజిల్లిన చినగంజాం రైల్వే స్టేషన్ ప్రస్తుతం దీనస్థితికి చేరే పరిస్థితి నెలకొంది. మారుతున్న కాలంతో పాటు అభివృద్ధిలో పురోగమించాల్సింది పోయి తిరోగమిస్తోంది. ఇటీవల కోట్లాది రూపాయిల వ్యయంతో సాంకేతిక పరమైన అభివృద్ధితో నూతనంగా రైల్వే స్టేషన్ నిర్మాణం సైతం చేసినప్పటికీ స్థానిక ప్రజలకు సౌకర్యాలను నిలిపివేసి నిరుపయోగంగా మారే పరిస్థితి. ఎన్నో దశాబ్దాలుగా రెండు లైన్‌లతో కొనసాగిన రైల్వేలైన్ మూడో లైను మంజూరై ముమ్మరంగా పనులు సైతం సాగుతున్న ప్రస్తుత తరుణంలో ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలను అందించక పోగా ప్రస్తుతం ఉన్న సౌకర్యాలను తొలగించేందుకు రైల్వే అధికారులు చర్యలు తీసుకోవడంతో చినగంజాం రైల్వే స్టేషన్ పూర్వ వైభవాన్ని కోల్పోయే ప్రమాదం ఉంది.

కొన్ని ఎక్స్‌ప్రెస్‌ల నిలిపివేత..

రైల్వే రిజర్వేషన్, సీజన్ టికెట్‌ల జారీ, స్టేషన్‌లో పలు రైళ్ల స్టాపింగ్‌ల ఎత్తివేతతో ప్రయాణికులు ఆందోళనలో ఉన్నారు. చినగంజాం రైల్వే స్టేషన్‌లో ఆగే తిరుమల ఎక్స్‌ప్రెస్, బొకారో ఎక్స్‌ప్రెస్, సర్కార్ ఎక్స్‌ప్రెస్, హౌరా ఎక్స్‌ప్రెస్‌ల స్టాపింగ్‌లను ఈపాటికే ఎత్తి వేయగా సామాన్య ప్రయాణికులు ప్రయాణం చేసే పాసింజర్ రైళ్లను సైతం స్టేషన్‌లో ఆపే పరిస్థితి లేకుండా పోయింది. నిత్యం చినగంజాం రైల్వే స్టేషన్ నుంచి వందలాది మంది కూలీలు, ఉద్యోగులు, విద్యార్థులు, ఇతర ప్రయాణికులు ప్రయాణం చేస్తుంటారు. వారిలో రోజూవారీ చార్జీలు భరించలేక రాయితీపై నెల, మూడు నెలల సీజన్ టికెట్‌లను స్టేషన్ బుకింగ్‌లో కొనుగోలు చేసి ప్రయాణం చేస్తుంటారు. సీజన్ టికెట్‌ల జారీ చేయకుండా నిలిపి వేస్తూ ఆన్‌లైన్‌లో కొనుగోలు చేసుకోవాలని, రైల్వేచట్టం మారిందంటూ సిబ్బంది సమాధానం ఇస్తుండటం, అంతేగాకుండా రైల్వే రిజర్వేషన్ టికెట్‌ల సైతం జారీ నిలిపివేస్తున్నట్లు రైల్వే అధికారులు చెప్పడంతో ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రెండు లక్షల మంది జనాభాకు అసౌకర్యం..

రైల్వే స్టేషన్‌లలో బుకింగ్ కౌంటర్‌లను ప్రైవేటు పరం చేసే కార్యక్రమంలో భాగంగా చినగంజాం, వేటపాలెం రైల్వే స్టేషన్ పరిధిలోని బుకింగ్ కౌంటర్‌లను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించేందుకు రైల్వే శాఖ రంగం సిద్ధం చేస్తున్నట్లు అధికారులు నుంచి సమాచారం. అమ్మనబ్రోలు రేల్వే స్టేషన్ బుకింగ్‌ను ప్రైవేట్ పరం చేసి అక్కడ పనిచేస్తున్న ఉద్యోగులను వేరే ప్రాంతాలకు బదిలీ చేశారు. అదే విధంగా చినగంజాం, వేటపాలెం రైల్వే స్టేషన్‌లలో రిజర్వేషన్ టికెట్‌ల జారీ నిలిపివేస్తే సుమారు 2 లక్షల జనాభా కలిగిన చినగంజాం, వేటపాలెం, ఇంకొల్లు మండలాలతో పాటు అమ్మనబ్రోలు, నాగులుప్పలపాడు మండలాల ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడే పరిస్థితి నెలకొంది. ఆయా మండలాల సుమారు 2 లక్షలకు పైగా ప్రజలు, స్థానికంగా ప్రయాణికులు దేశంలోని ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు రిజర్వేషన్ టికెట్‌ల కోసం సుమారు 40 కి.మీలు పైగా ఒంగోలు, చీరాల రైల్వే స్టేషన్‌లకు వెళ్లి ఒక రోజంతా వెచ్చించాల్సిన పరిస్థితి దాపురించింది.

> **సౌకర్యం కల్పించని స్టేషన్ ఎందుకు..**
>
> 
>
> స్థానికంగా ప్రజలకు సౌకర్యాలు అందించలేని రైల్వే స్టేషన్ కోట్ల రూపాయిలు ఖర్చు పెట్టి నిర్మాణం చేసినా ప్రయోజనం ఏముంటుంది. చినగంజాం మండలంతో పాటు చుట్టు పక్కల మండలాల్లో ఉన్న కూలీలు, ఉద్యోగులు, విద్యార్థులకు సీజన్ టికెట్‌ల జారీతో ఎంతో మేలు జరుగుతుంది. అటువంటిది వాటిని బుకింగ్‌లో ఇవ్వకుండా ఆపివేయటం బాధాకరం.
>
> – షేక్ నజీర్, స్థానికుడు

> **రిజర్వేషన్, సీజన్ టికెట్‌లు జారీని కొనసాగించాలి..**
>
> 
>
> చినగంజాం రైల్వే స్టేషన్‌లో రిజర్వేషన్, సీజన్ టికెట్‌ల జారీని యథావిధిగా కొనసాగించాలి. వేల మంది ప్రయాణికులు సీజన్ టికెట్‌ల మీద ఆధారపడి తమ జీవనాన్ని కొనసాగిస్తున్నారు. అంతేగాకుండా రిజర్వేషన్ సౌకర్యం తొలగిస్తే ప్రజలు అవస్థలు పడతారు. విద్యార్థులు, ఉద్యోగులు, దూర ప్రాంతాల్లో ఉద్యోగాలు చేసే వారు తీవ్ర ఇబ్బందులు పడే పరిస్థితి ఉంది.
>
> – అక్కల రవీంద్ర, స్థానికుడు

ఆసరాతో మహిళలు ఆర్థికంగా ఎదగాలి



మహిళా గ్రూపులకు ఆసరా చెక్ అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే కృష్ణమోహన్

- నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆమంచి కృష్ణమోహన్

చినగంజాం: రాష్ట్రంలో మహిళలను ఆర్థికంగా ఆదుకునేందుకే సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వైఎస్సార్ ఆసరా పథకాన్ని ప్రవేశపెట్టి పూర్తి స్థాయిలో అమలు చేశారని పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ అన్నారు. వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమంలో భాగంగా స్థానిక ఇంకొల్లు ఏఎంసీ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన సభకు ఏపీఎం తేళ్ల మోహనరావు అధ్యక్షత వహించగా ఇన్‌చార్జ్ ఆమంచి కృష్ణమోహన్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్ పాదయాత్రలో భాగంగా మహిళలకు ఇచ్చిన హామీని మేనిఫెస్టోలో చేర్చి ఆసరా పేరుతో ఇప్పటి వరకు మూడ విడతలుగా రుణ మాఫీ చేశారని పేర్కొన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పసుపు, కుంకుమ పేరుతో చంద్రబాబు నాయుడు మహిళలను మోసగించారని విమర్శించారు. ఆసరా పంపిణీలో భాగంగా మొత్తం 1225 గ్రూపులకు రూ 9.71 కోట్ల చెక్కు ఆయన మహిళా గ్రూపులకు పంపిణీ చేశారు. అనంతరం సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు.

గృహసారథులు, కన్వీనర్లు వారధులు..

ప్రభుత్వ పథకాలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకే రాష్ట్రంలో గృహసారథులను ఏర్పాటు చేశామని ఆమంచి అన్నారు. ఇంకొల్లులో వైఎస్సార్ సీపీ ఏర్పాటు చేసిన గృహ సారథులు, సచివాలయ కన్వీనర్‌లు, మండల కన్వీనర్‌లు, గ్రామ వలంటీర్లకు శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందిచమే కాకుండా పార్టీ ప్రతిష్టను ప్రజల్లో పెంచే విధంగా గృహ కృషి చేయాలని సూచించారు. అనంతరం ఆయన ప్రచార సామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకుడు చుండూరి రవిబాబు, ఇన్‌చార్జ్ ఎంపీడీవో శ్రీనివాసరావు, ఎంపీపీ బండారు అనూష, సర్పంచ్ ఏజర్ల ప్రసన్న, వైస్ ఎంపీపీ తూమాటి చలమయ్య, మండల కన్వీనర్ బండారు ప్రభాకరరావు, ఉప సర్పంచ్ లతీఫ్, మండల జేసీఎస్ కన్వీనర్ షేక్ మస్తాన్ వలి, రాష్ట్ర డైరెక్టర్ జక్కిరెడ్డి సుబ్బాయమ్మ, రావి పేరయ్య, బండ్ల వెంకట సుబ్బారావు కో ఆప్షన్ సభ్యులు సుభాని, ధనుంజయరాజు, ఎస్సీ సెల్ కన్వీనర్ గుంటూరు శ్రీనివాసరావు, మండలంలోని అన్ని పంచాయతీల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఎస్సీ రాష్ట్ర కార్యదర్శి బీళ్లాలి డేవిడ్, ఎంపీటీసీ ఉస్మాన్, వార్డు మెంబర్‌లు షమీమ్, ఖాసిం, మాలిక్, ప్రసాద్, ప్రసంగి, సయ్యద్ సలీం, పీఏసీఎస్ చైర్మన్‌లు రామకృష్ణారెడ్డి, గాదె సుబ్బారెడ్డి, భవనం రామిరెడ్డి, అనిల్, కాసు పిచ్చిరెడ్డి, పల్లెపోగు ప్రసాద్, నలతోటి సునీల్ బాబు, పురంశెట్టి సురేష్, చిన్నిపూర్ణారావు, గుది ఆదియ్య, అడపా సుధాకర్ రెడ్డి, సోషల్ మీడియా కన్వీనర్ బూరగ రాము, కోకన్వీనర్ జెట్టి ప్రేమ్‌కుమార్, పీ. రాఘవ, మార్టూరు మండల సోషల్ మీడియా కన్వీనర్ బోగూరు చంద్రబాబు, ఆలపాటి నాని, ప్రజా ప్రతినిధులు, స్థానిక ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

మహిళలకు ఆర్థిక భరోసా 'ఆసరా'



సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కృష్ణచైతన్య, మహిళలు

- శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య

అద్దంకి రూరల్: వైఎస్సార్ ఆసరా పథకం మహిళలకు ఆర్థిక భరోసానిస్తుందని రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య అన్నారు. శుక్రవారం స్థానిక ప్రకాశం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మూడో విడత వైఎస్సార్ అసరా పథకం చెక్కును లబ్ధిదారులకు అందజేశారు. ఈసందర్భంగా కృష్ణచైతన్య మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అక్కచెల్లెమ్మకు ప్రజా సంకల్పయాత్రలో ఇచ్చిన మాటప్రకారం మూడు విడతలుగా ఆసరా నగదును విడుదల చేశారన్నారు. అద్దంకి మండలంలోని 975 గ్రూపులోని 9772 మంది సభ్యులకు రూ. 6.52 కోట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. గత ప్రభుత్వం డ్రాక్వా గ్రూపు రుణాలు మాఫీ చేస్తానని మహిళలను మోసం చేసిందన్నారు. ఎన్నికల ముందు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తరువాత మరచిపోవటం చంద్రబాబు చేసే పని అని ఎద్దేవా చేశారు. కరోనా లాంటి విపత్తులో కూడా సంక్షేమ పథకాలు అందజేసిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. అనంతరం సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ అవిశెన జ్యోతి, వైఎస్ ఎంపపీ గెల్లా నాగమల్లి, అద్దంకి మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ జ్యోతి హనుమంతరావు, ఏపీవో కోటేశ్వరరావు, ఏరియా కోఆర్డినేటర్ రవి, అద్దంకి మున్సిపల్ చైర్మన్ పద్మేష్, సర్పంచ్‌లు స్థానిక నేతలు సందిరెడ్డి రమేష్, కాకాని రాధకృష్ణమూర్తి, అవిశెన ప్రభాకరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలి

పర్చూరు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మెగా జాబ్ మేళాను నిరుద్యోగులందరూ సద్వినియోగం చేసుకోవాలని పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాజీ ఎమ్మెల్యే అమంచి కృష్ణమోహన్ అన్నారు. శుక్రవారం భవనం అంజిరెడ్డి అండ్ తులాబందుల అర్జునయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మెగా జాబ్‌మేళా కార్యక్రమాన్ని నిర్వహించారు. జాబ్‌మేళాకు 15 కంపెనీలకు చెందిన ప్రతినిధులు హజరయ్యారు. 219 మంది నిరుద్యోగ యువతీ, యువకులు పాల్గొనగా 83 మంది ఎంపికచేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మల్లా అంజమ్మ శ్రీనివాసరావు, కరస్పాండెంట్ క్రిష్ణంశెట్టి రమేష్ బాబు, డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ ఒగ్గిశెట్టి నరసింహం, ఎస్కె అహ్మద్‌బాషా, ట్రెజరర్ కోట శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ కోట హరి ప్రసాద్, కళాశాల ప్రిన్సిపాల్ రత్నకుమారి, జిల్లా నైపుణ్యాభివద్ధి అధికారి జి.సుధాకర్, జిల్లా ప్లేస్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ డి.రమేష్‌బాబు, స్కిల్ హబ్ ఇన్‌చార్జ్ పి.వినోద్, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య లేకుండా చర్యలు చేపట్టాలి

- అధికారులకు ఎమ్మెల్యే కరణం ఆదేశం



కార్యాలయ మరమ్మతులపై సూచనలందిస్తున్న ఎమ్మెల్యే కరణం

చీరాల టౌన్: రాన్ను వేసవిని దృష్టిలో ఉంచుకుని గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు తాగునీటి విషయంలో ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి అధికారులను ఆదేశించారు. శుక్రవారం చీరాల ఎంపీడీవో కార్యాలయాన్ని ఎమ్మెల్యే ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎంపీడీవో కార్యాలయంలో ఉద్యోగుల హాజరు, పెండింగ్ అర్జీలు, కార్యాలయంలో చేయాల్సిన మరమ్మతుల గురించి పరిశీలించారు. అనంతరం ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ సతీష్‌చంద్ర, ఎంపీడీవో నేతాజీలతో కలిసి తాగునీటి సమస్యలపై చర్చించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చీరాల మండలంలోని తీరప్రాంత గ్రామాలకు మంచినీటి సమస్య లేకుండా అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు. గవినివారిపాలెం, వాడరేవు, విజయలక్ష్మీపురం, దేవినూతల, తదితర గ్రామాల్లోని ప్రజలకు తాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. అలానే మండల పరిషత్ కార్యాలయం మరమ్మతులకు ప్రత్యేకంగా నిధులు విడుదల చేయించి అభివృద్ధి చేస్తామన్నారు. ఎమ్మెల్యే వెంట పలు గ్రామాల కార్యదర్శులు, పలువురు కౌన్సిలర్లు ఉన్నారు.

13న జాతీయ లోక్‌అదాలత్

అద్దంకి రూరల్: మే 13న జాతీయ లోక్ ఆదాలత్ నిర్వహించనున్నట్లు సీనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ బీ. బాబునాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అవకాశాన్ని కోర్టు పరిధిలోని అద్దంకి, కోరిశపాడు, జే. పంగులూరు, మార్టూరు, బల్లికురవ, సంతమాగులూరు మండలాల్లోని కక్షిదారులు, ప్రజలు వినియోగించుకోవాలని బాబునాయక్ కోరారు.

సోషల్ మీడియాలో వార్తలు అవాస్తవం



మాట్లాడుతున్న అధికారులు, నాయకులు

మేదరమెట్ల: ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలు అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ అందుతున్నాయని, కావాలనే టీడీపీ నాయకులు విమర్శలు చేస్తున్నారని వైఎస్సార్ సీపీ నాయకులు, వీఆర్వో నారాయణ అన్నారు. కొరిశపాడు మండలంలోని పీ.గుడిపాడు పంచాయితీ పరిధిలో సక్రమంగా అందడం లేదని ఇటీవల టీడీపీకి చెందిన పలువురు సోషల్ మీడియాలో ప్రకటనలు చేశారు. దీనిపై పంచాయతీ, రెవెన్యూ, సచివాలయం ఉద్యోగులు శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించి వాస్తవాలు వెల్లడించారు. ఒకే ఇంట్లో ఉన్న ఇద్దరు అన్నదమ్ములకు రైతుభరోసా పడటంలేదని, తల్లికి కాపునేస్తం రాలేదని టీడీపీకి చెందిన వ్యక్తి ఆరోపించగా దీనికి సంబంధించి తమ్ముడి ఖాతా మ్యాపింగ్ అయినందువల్ల తమ్ముడి బ్యాంకు ఖాతాలో రైతు భరోసా పడిందని అధికారులు తెలిపారు. అలాగే కాపు నేస్తం పడలేదని ఆరోపించారు. దీనికి సంబంధించి కాపు నేస్తం సొమ్ము పడినట్లు బ్యాంకు బుక్‌లో నమోదు అయ్యిందని అధికారులు పేర్కొన్నారు. కేవలం అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అందిస్తున్న ఏకైన ప్రభుత్వం ఒక్క వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వమే అని స్థానిక నాయకులు తెలిపారు. కార్యక్రమంలో ఈవో అజయ్, సచివాలయం ఉద్యోగులు, సర్పంచ్ తాడి ఆదిలక్ష్మి కృష్ణమూర్తి, రావూరి డేవిడ్‌సన్, కొట్టే సుబ్బారావు, దాసరి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అధికారుల పనితీరు మార్చుకోవాలి



పారిశుద్ధ్య సమస్యలపై అధికారులకు వివరిస్తున్న కౌన్సిలర్లు

చీరాల: పురపాలక సంఘంలో అక్రమ కట్టడాలు కడుతున్న వాటికి పన్నులు ఎలా వేస్తారు ? కోర్టు వివాదాల్లో ఉన్న భూమిలో నిర్మాణాలు చేస్తున్నప్పటికీ అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదో తెలపాలని కౌన్సిలర్లు పట్టుబట్టారు. శుక్రవారం చీరాల పురపాలక సంఘ సమావేశాన్ని చైర్మన్ జంజనం శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో కౌన్సిలర్ సూరగాని లక్ష్మీ, మామిడాల రాములు, మరికొందరు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. టౌన్‌హాలులో అక్రమంగా దుఖాణాలు నిర్మించి, వాటికి మున్సిపల్ అధికారులు పన్నులు ఎలా వేస్తారని ప్రశ్నించారు. కోర్టు వివాదంలో ఉన్న స్థలంలో అక్రమ నిర్మాణాలు చేస్తున్నా అధికారులు ఎందుకు అడ్డుకోలేదో చెప్పాలన్నారు. దీనిపై మున్సిపల్ డీఈ ఐసయ్య, చైర్మన్ జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు కీర్తి వెంకటరావు, సూరగాని లక్ష్మీలు ప్రశ్నించారు. అలానే అజెండాలోని నాలుగు అంశాలు మిగిలిన అంశాలకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. సమావేశంలో నూతన కమిషనర్ రామచంద్రారెడ్డి, టీపీవో రామకృష్ణ, పలుశాఖల అధికారులు, మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

అవినీతికి కేరాఫ్ జన్మభూమి కమిటీలు

- పారదర్శక పాలన కోసమే సచివాలయ, వలంటీర్ వ్యవస్థ
- నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆమంచి కృష్ణమోహన్



'నా నమ్మకం నీవే జగన్' స్టిక్కర్ విడుదల చేస్తున్న కృష్ణమోహన్



మార్టూరు శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆమంచి

మార్టూరు/యద్దనపూడి: గత ప్రభుత్వ పాలనలో జన్మభూమి కమిటీలు అవినీతికి పరాకాష్టగా మారాయని వాటిని రూపుమాపి ప్రజలకు పారదర్శక పాలన అందించడం కోసమే సీఎం వైఎస్ జగన్ మోహనరెడ్డి సచివాలయ, వలంటీర్ వ్యవస్థను నెలకొల్పారని పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ పేర్కొన్నారు. మార్టూరులోని విజయలక్ష్మి కల్యాణ మండపంలో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన గృహ సారథులు, సచివాలయ కన్వీనర్‌ల శిక్షణ కార్యక్రమంలోఆయన మాట్లాడారు. కోవిడ్ సమయంలో ప్రాణాలకు తెగించి వలంటీర్‌లు చేసిన సేవలను ఆయన కొనియాడారు. నేడు కుల, మత, వర్గ, పార్టీలకు అతీతంగా గ్రామ వలంటీర్‌లు లబ్ధిదారులకు అందజేస్తున్న సంక్షేమ పథకాలు అవినీతికి తావు లేకుండా నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలోనికి చేరుతున్నాయన్నారు. రానున్న సంవత్సర కాలం ప్రభుత్వానికి చాలా కీలకమని, ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయడంలో అలసత్వం వహించే వలంటీర్‌లపై ఉపేక్షించే ప్రసక్తే లేదని ఆమంచి నిర్మోహమాటంగా హెచ్చరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి తన్నీరు శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో జెడ్పీ వైస్ చైర్మన్ చుండి సుజ్ఞానమ్మ, హిస్టరీ అకాడెమీ డైరెక్టర్ జక్కిరెడ్డి సుబ్బాయమ్మ, ఎంపీపీ భుక్యాశాంతిబాయి, పార్టీ నాయకులు జాష్టి వెంకట నారాయణ బాబు, పఠాన్ కాలేషావలి, గద్దం మస్తాన్‌వలి, డాక్టర్ నరేంద్రబాబు, కాకోలు వెంకటేశ్వర్లు మాట్లాడారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్‌లు భుక్యా సునీతా బాయి, కాకోలు రామారావు, ఉప్పలపాటి చెంగలయ్య, తాటి వెంకటరావు, ఎస్ఎంబీ బుడే, గన్నవరం బుడే, రాజా నాయక్, రవి చంద్, బండి రామయ్య, అట్లూరి సుకుందరావు, వినకొండ సుధాకర్, సర్పంచ్‌లు, సచివాలయ కన్వీనర్‌లు, వలంటీర్‌లు, తదితర నాయకులు పాల్గొన్నారు.

☛ రాజకీయాలకు అతీతంగా అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేసి ప్రభుత్వ పథకాలను అందిచాల్సిన బాధ్యత ప్రజా ప్రతినిధులతో పాటు గృహ సారథులు, వలంటీర్‌లు, కన్వీనర్‌లపై ఉందని ఆమంచి కృష్ణమోహన్ సూచించారు. మండల కేంద్రం యద్దనపూడిలోని వెలుగు కార్యాలయం ఆవరణలో గృహసారథులు, వలంటీర్లకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ పులగం రజని, జెడ్పీటీసీ చుండి లక్ష్మీనారాయణమ్మ, మండల కన్వీనర్ ఎస్ వెంకటప్పయ్య, జేసీఎస్ కన్వీనర్ దూళిపాళ్ల వేణు, గ్రామ సర్పంచ్ వల్లేరు రేణుక, వైస్ ఎంపీపీలు చెరుకూరి నాగరత్నమ్మ, ఐమాల శ్యాంసన్, పార్లమెంటరీ జిల్లా కార్యదర్శి తమ్మా అమ్మిరెడ్డి, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు కొడవలి అప్పయ్య చౌదరి, మాజీ జిల్లా కమిటీ సభ్యులు ముప్పల రాంబాబు, ఎంపీటీసీలు గొట్టిపాటి సతీష్, వంకాయల పాటి సునీత, పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పాలెపోగు రాంబాబు, గోరంట్ల సాంబయ్య, కోడూరి నాగరాజు, పఠాన్ అయూబ్ ఖాన్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.